క్లుప్తంగా

సంపూర్ణ పోషణే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

గుంతకల్లుటౌన్: పిల్లలు, గర్భిణీలు, బాలింతల సంపూర్ణ పోషణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందు కోసం దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. శనివారం మోదినాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపడం వల్ల ప్రాథమిక విద్య కోసం సంసిద్ధత చేసినట్లవుతుందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీలను ప్రభుత్వం తీర్చిదిద్దిందని ఆమె పేర్కొన్నారు. వార్డు మహిళా సంరక్షణా కార్యదర్శి పుష్యమి, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించండి



పనులను పరిశీలిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సెయింట్ పీటర్స్ స్కూల్ వద్ద జరుగుతున్న సీసీరోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించేలా పనులను పర్యవేక్షించాలని ఇంజినీర్లకు తెలియజేశారు. పనులను సకాలంలో పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడి మృతి

పుట్లూరు: శనగలగూడూరుకు చెందిన వంశీవర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి కిడ్నీ, లివర్ సమస్యలతో శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన గాడిబావి శివారెడ్డి, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు వంశీవర్ధన్‌రెడ్డికి కిడ్నీ, లివర్ సమస్యలు ఉండటంతో వైద్యం కోసం రూ.20 లక్షల మేరకు ఖర్చు చేశారు. ప్రభుత్వం కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్స్ కోసం రూ.12 లక్షలను మంజూరు చేయగా లివర్ సమస్యతో ఆరోగ్యం క్షీణించింది. శనివారం డయాలసిస్ కోసం అనంతపురానికి వెళ్లగా అక్కడే మృతి చెందాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం



పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లగా రెండో సారి ఎంపికైన హరనాథ్‌రెడ్డి, బుసా సుధీర్ రెడ్డి(బుసా సుదర్శన్ రెడ్డి)ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం జిల్లా కోర్టు పీపీగా ఆర్.హరినాథ్‌రెడ్డి, గుత్తి ఏడీజే ఏపీపీగా బుసా సుధీర్‌రెడ్డి వరుసగా రెండో సారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు వారిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ సుభాష్‌రెడ్డి, ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, బార్ అసోసియేషన్ నాయకులు తిమ్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ వాల్మీకి శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

యల్లనూరు: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం యల్లనూరు పోలీస్‌స్టేషన్ ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రికార్డులు సక్రమంగా వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శివరావు గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరితో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందికి సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా సంరక్షక కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దిశ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి







యాడికి : కేజీబీవీలో ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీటీసీ విజయగౌరి, సర్పంచు ఓంకారమ్మ, బీకేఎస్: విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం, గుత్తి: విద్యార్థులకు పురస్కారాలు అందించిన దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం బీకేఎస్ జెడ్పీ హైస్కూల్, సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాల పథకంలో భాగంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో రూ.10 లక్షలతో చేపడుతున్న డైనింగ్‌హాల్ పనులను జెడ్పీటీసీ పరిశీలించారు. బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, సాకే లక్ష్మి నారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, బీకేఎస్, సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి తమ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మిగతా వారిలో స్ఫూర్తి నింపుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ హసీనా బేగం అన్నారు. శనివారం యాడికి, రాయలచెరువు, కేజీబీవీలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద ఆయా పాఠశాలల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతోపాటు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు విజయమ్మ, డేనియల్, ప్రిన్సిపాల్ నిర్మల, సర్పంచులు ఓంకారమ్మ, తలారీ అరుణ, వేములపాడు ఎంపీటీసీ విజయగౌరి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు శనివారం జగనన్న ఆణిముత్యాలు అవార్డులను ప్రదానం చేశారు. కౌన్సిలర్ దాసరి పుష్పావతి, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోట మనోహరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కోట వెంకటేష్, బేల్దారి చంద్ర , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలని ఎంపీపీ వెంకట నారాయణ పేర్కొన్నారు. శనివారం కొప్పలకొండ జెడ్పీ హై స్కూల్లో జగనన్న ఆణిముత్యాలు పథకానికి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మా నించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థుల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రంగస్వామి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సొంతంగా నగదు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శాంత భాయ్, సర్పంచు రామలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగగన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళేషు, పెద్దనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

యల్లనూరు: ఇళ్ల నిర్మాణాలను త్వరగతిన ప్రారంభించుకోవాలని గృహనిర్మాణశాఖ ఏఈ సుప్రజ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పాతపేట ఎస్సీ కాలనీలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుమతి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ జగనన్న ఇళ్ల నిర్మాణాలను చేసుకోవాలన్నారు. త్వరగా నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వేగవంతంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. మండల వ్యాప్తంగా 186 ఇళ్లు మంజూరుకాగా 136 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని, 50ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని ఏఈ తెలిపారు. ఎంపీడీఓ వీరరాజు, సచివాలయ సిబ్బంది శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం దయ్యాలకుంటపల్లిలోని జగనన్న కాలనీలలో పర్యటించారు. ముందుగా గ్రామంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయి, ఎంత మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరయ్యాయని వివరాలు అడిగి



ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు, హౌసింగ్ ఏఈ సుప్రజ

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ జగనన్న కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, మండల స్పెషలాఫీసర్ శ్రీమన్నారాయణ, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.

'వైఎస్సార్ పశుబీమా' సద్వినియోగం చేసుకోండి

శింగనమల: పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులు వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి అన్నారు. శనివారం శింగనమలలోని వెటర్నరీ కార్యాలయంలో పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులతో వైఎస్సార్ పశుబీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుబీమాతో పశువులు మృతి చెందిన నష్టపరిహారం అందుతుందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దారిద్ర రేఖకు దిగువ ఉన్న పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 40 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తాయన్నారు. గేద జాతి అయితే మూడు నుంచి 12 ఏళ్లలోపు, ఆవు జాతి అయితే రెండు నుంచి పదేళ్లలోపు ఉండాలన్నారు. గొర్రెలు ఆరు నెలలు పైబడి ఉండాలన్నారు. ఒక్కో కుటుంబానికీ ఐదు పశువులు, 50 గొర్రెలు వరకు బీమా చేయించుకునే అవకాశం ఉందన్నారు. బీమా వర్తించాలంటే పశువు, గొర్రెకు చెవి పోగు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పశుబీమా పోస్టర్లు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వి నారాయణ, సర్పంచ్ వెంకటరాముడు, ఎంపీటీసీ ఉమా, పశుసంవర్ధక శాఖ డివిజనల్ అధికారి రమేష్‌రెడ్డి, ఏడీ పద్మనాభం, ఏపీఓ నారాయణస్వామి, గోపాల మిత్రలు, ఏహెచ్‌ఏలు, రైతులు, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.



వైఎస్సార్ పశుబీమా పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మట్కా బీటర్ల అరెస్టు

గుంతకల్లు: టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మట్కా రాస్తున్న మీసాల వెంకటేష్, దూదేకుల నూర్‌మహ్మమద్‌ను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ గణేష్ శనివారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1.33 లక్షల నగదు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తాడిపత్రి అర్బన్: చుక్కలూరు సర్కిల్ వద్ద గుట్టుగా మట్కా రాస్తున్న పట్టణంలోని సుంకులమ్మ పాలెంకు చెందిన విశ్వనాథ్‌ను శనివారం సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మట్కా చీటీలు, రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

ఆలయానికి విరాళం

బుక్కరాయసముద్రం: మండలంలోని ఓపెన్ ఎయిర్ జైలు పీఏ కాలనీలో పోతలయ్య స్వామి ఆలయ నిర్మాణానికి మత్స్యకారుల సంఘం రూ.20 విరాళం అందించింది. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నగేష్ శుక్రవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. సంఘం కార్యవర్గ సభ్యులు తరిమెల రామాంజనేయులు, రవికుమార్, బోరు చిన్న మంజునాథ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: పెనకచెర్లకు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి ఆత్మహతకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిన్న ఓబులేసు ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్థల విషయంలో ఘర్షణ

గుత్తి రూరల్: రజాపురం గ్రామంలో స్థల విషయంలో శనివారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుహాసిని, మూర్తి మధ్య ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలం విషయంలో కొన్నేళ్లుగా గొడవలు ఉన్నాయి. అయితే అదే విషయంలో శనివారం మరో మారు గొడవ పడ్డారు. ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో సుహాసిని తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తి రూరల్: బ్రాహ్మణపల్లిలో ఆస్తి విషయంలో శనివారం అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మల్లికార్జున, ఓబుశేసు మధ్య కొన్నేళ్లుగా ఆస్తి విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అదే విషయంపై ఇద్దరు దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలి

గార్లదిన్నె: ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలని ఏడీఏ రవి ఎరువుల దుకాణదారులను ఆదేశించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం అగ్రి ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డీలర్లందరూ మార్గదర్శకాల ప్రకారం దుకాణాలు నిర్వహించాలన్నారు. రైతులకు నాణ్యమైన సీడ్స్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ అందించాలన్నారు. ఏఓ సోమశేఖర్, డీలర్లు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: మండలంలోని పాతబస్టాండ్ వద్ద పేకాట ఆడుతున్న 11 మందిని శనివారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.ఈసందర్భంగా నిందితుల నుంచి రూ.13,750 స్వాధీనం చేసుకున్నామన్నారు.

సీఐని కలిసిన ప్రజా ప్రతినిధులు

బుక్కరాయసముద్రం: స్థానిక పోలీస్‌స్టేషన్లో సీఐ నాగార్జునరెడ్డిని జెడ్పీటీసీ భాస్కర్, ప్రజా ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు పార్వతి, శ్రీనివాసరెడ్డి, నాయకులు ముసలన్న, పూల నారాయణస్వామి, రామచంద్రారెడ్డి, గోవిందరెడ్డి, శివ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

శింగనమల: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగి ఉండాలని సీఐ అస్రార్ బాషా తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా

పామిడి: పట్టణంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై వై జంక్షన్ క్రాస్ సమీపాన శనివారం లారీ బోల్తా పడింది. వివరాలు.. ఆదోని నుంచి పత్తిలోడ్‌తో లారీ మధురైకు బయలుదేరింది. వై జంక్షన్ క్రాస్ సమీపాన అతివేగంతో లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ రాజు సురక్షితంగా బయటపడ్డాడు.

గ్రామ సచివాలయం తనిఖీ

పెద్దవడుగూరు: చిన్న వడుగూరు గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీడీఓ సూచించారు. హౌసింగ్ ఏఈ నెట్టికంఠయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్రగాయాలు

పామిడి: స్థానిక కరెంటు ఆఫీసు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడింది. వివరాలు..సాయంత్రం కరెంటు ఆఫీసు వద్దనున్న చికెన్‌సెంటర్ వద్ద కోళ్లు అన్‌లోడ్ చేయడానికి వ్యాన్ వచ్చింది. ఈక్రమంలో చెత్త పారేయడానికి వచ్చిన బెస్త లక్ష్మీదేవిని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆమె కుడిచేయి నుజ్జునుజ్జయింది. వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంకను కబ్జా నుంచి కాపాడండి



నిరసన తెలియజేస్తున్న కూలీలు

యాడికి: నిట్టూరులో వంకను కబ్జారాయుళ్ల నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. నిట్టూరు గ్రామానికి చెందిన శ్రీరాములు, మద్దిలేటి రాముడు గ్రామ సమీపంలో వంకలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వచ్చి ఈ స్థలం తమదేనని మీరు ఇక్కడ పనులు చేయకూడదని బెదిరిస్తూ పనులు జరగకుండా చేశారన్నారు. తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి, కూలీలు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తాడిపత్రి టౌన్: పెద్దపప్పూరు మండలం జూటూరులో ఆదివారం తలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దిరాజు, ఆదినారాయణ కోరారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

గుంతకల్లుటౌన్: ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీతత్వాన్ని దీటుగా ఎదుర్కునే తత్వాన్ని అలవర్చుకోవాలంటే ఆంగ్లంపై పట్టు సాధించాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్ఞానేశ్వర్, టీఓటీ కోఆర్డినేటర్ మస్తాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్‌పై అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. డిగ్రీ కోర్సుల్లో ఇంగ్లిష్ బోధనపై ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. విద్యార్థులు ఆంగ్ల బాషా ప్రావీణ్యంలో పట్టు సాధించి రేపటి సవాళ్లను అధిగమించేలా వారిని తీర్చిదిద్దాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, శివశంకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

పామిడి: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ యూనిట్ కల్నల్ సందీప్‌ముంద్రా అన్నారు. శనివారం స్థానిక టీసీహైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవానికి కల్నల్‌తో పాటు సుబేదార్ సుఖ్‌దేవ్‌సింగ్ హాజరై మాట్లాడారు. హెచ్‌ఎం మున్వర్‌బాషా, ఎన్‌సీసీ యూనిట్ అధికారి వై రామాంజనేయులు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ నాగమణి, మాజీ సైనికోద్యోగులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వాటర్‌మన్ కుటుంబానికి తక్షణ సాయం



మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీ రంగయ్య

గార్లదిన్నె: స్థానిక పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మన్‌గా పని చేస్తున్న నల్లప్ప ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.15 వేలు తక్షణ సాయం అందించినట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. ఎంపీ తలారి రంగయ్య అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో నల్లప్ప మృతదేహాన్ని పరిశీలించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి , వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ ఉన్నారు.

చర్యలు తీసుకోండి

శింగనమల: ఈస్ట్ నరసాపురం సచివాలయం కార్యదర్శి నర్మదపై దురుసుగా ప్రవర్తించిన ఓబిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఐ అస్రార్ బాషాకు ఉద్యోగులు శనివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, ప్రసాదు, బి.రామాంజనేయులు, ఓబిరెడ్డి, మసూద్ వలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను పక్కాగా నిర్వహించండి

గుత్తి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వివిధ కారణాలతో కొందరు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. జూన్ 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేయాలన్నారు. సచివాలయాల క్లర్క్ ఇమామ్ ,చంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరరాజు మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాల సందర్శన, గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలు ఏదైనా సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటే వాటిని వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ, మరణ, జనన, వివాహ, ఫ్యామిలీ, మ్యుటేషన్ వంటి సర్టిఫికెట్లు అవసరమైన వారికి తగిన డాక్యుమెంట్లు తీసుకొని క్యాంపు రోజున ఇప్పించాలన్నారు. తహసీల్దారు సుమతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



గుత్తి: మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికీ అందించాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు కుల, ఆదాయ, మరణ, జనన, వివాహ, ఫ్యామిలీ, మ్యుటేషన్ వంటి సర్టిఫికెట్లును ఉచితంగా అందించాలన్నారు. మండల స్పెషలాఫీసర్ శ్రీమన్నారాయణ, ఎంపీడీఓ విజయ భాస్కర్, పంచాయతీ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుట్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయన వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించడంతోపాటు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తామన్నారు. ఇందుకోసం ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు టీంలను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలన్నారు. తహసీల్దార్ ఉషారాణి, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొ న్నారు.

గుత్తి రూరల్: ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్షపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శనివారం అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్ బాషా జగనన్న సురక్ష గురించి వివరించారు. సమస్యల పరిష్కారం ఎలా చూపాలి అనే విధానాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

రామస్వామిగుడి ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున గల అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయ ధర్మకర్త మండలిని నియామకానికి దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు శనివారం ఆలయ ఈఓ మతం మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మకర్తలుగా ఆసక్తి కలిగిన వారు జూలై 1లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలను జతపరిచి దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖ అధికారికి పంపాలని, వివరాలకు 9440699921 నంబరులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.